# 17న నగరానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## -శీతాకాల విడిది కోసం ముస్తాబవుతున్న రాష్ట్రపతి నిలయం



రాష్ట్రపతి నిలయం(ఫైల్‌ఫొటో)



ద్రౌపది ముర్ము(ఫైల్‌ఫొటో)

**అల్వాల్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** దేశ ప్రథమ పౌరురాలికి ఆతిధ్యం ఇచ్చేందుకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ముస్తాబవుతోంది. శీతాకాల విడిదిలో బాగంగా డిసెంబరు 17వ తేదీన ద్రౌపది ముర్ము నగరానికి రానున్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఐదు రోజులు పాటు బస చేస్తారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపాదికతన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. 17వ తేదీ మద్యాహ్నాం ప్రత్యేక విమానంలో హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు ఆమె చేరుకుంటారు. 18,19వ తేదీలులో రాష్ట్రపతి నిలయంలోనే సేద తీరనున్నారు. అనంతరం నగరంలోని పలు కార్యక్రమాలకు ఆమె హాజరవుతారు. 21వ తేదీ మద్యాహ్నాం మరలా ఆమె ఢిల్లీకి పయనవుతారు. ప్రతి ఏదాడి శీతాకాలంలో రాష్ట్రపతులు దక్షిణాది పర్యటనలో బాగంగా బొల్లారం నుంచే దేశ పరిపాలనా బాధ్యతలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్రపతి నగరంతో పాటుగా ఇతర రాష్ట్రాలకు అధికార పర్యటనలకు ఇక్కడి నుంచే వెళ్తారు. తన పర్యటనలు ముగించుకుని మరలా రాష్ట్రపతి భవనానికి చేరుకుంటారు. దేశ మొట్ట మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మొదలు నేటి ద్రౌపది ముర్ము వరకు బొల్లారం రాష్ట్రపతి నిలయంలో బస చేసిన వారే. సర్వేపల్లి రాధాక్రిష్ణ, జాకీర్ హుస్సేన్, వెంకటగిరి, నీలం సంజీవ్‌రెడ్డి, రామస్వామి వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ, అబ్దుల్‌కలాం, ప్రతిభాపాటిల్, ప్రణబ్ ముఖర్జీ, రామ్‌నాధ్ కోవింద్ రాష్ట్రపతి నిలయంలో సేద తీరారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవనం స్థాయిలో ప్రతిష్టాత్మకమైన భవనం ఇదే. సిమ్లాలో రాష్ట్రపతి విడిది భవనం మరొకటి ఉంది. దక్షిణాది ప్రాంతంలో బొల్లారంలో మాత్రమే రాష్ట్రపతికి భవనం ఉండడం విశేషం. జిహెచ్‌ఎంసి, కంటోన్మెంట్ విభాగాలుతో పాటుగా పోలీసు, విద్యుత్, జలమండలి సిబ్బంది వసతులు కల్పించడానికి నిరంతరం శ్రమిస్తున్నారు. భవనం చుట్టూ రక్షణ విభాగాలకు తోడు దట్టమైన చెట్లు చేమలు ఉండడంతో పాములు బెడద అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పాములు పట్టే వ్యక్తులుతో పరిసరాలను జల్లెడ పడుతున్నారు. రాష్ట్రపతి బస చేసే అన్ని రోజులు రక్షణ బాధ్యతలను స్థానిక పోలీసు యంత్రాంగం చేపడుతుంది.

**రాష్ట్రపతి నిలయం నేపథ్యం**

1805లో బ్రిటీష్ పాలకులు నిర్మించిన ఈ భవనాన్ని వైస్రాయ్ అతిథి గృహంగా పిలిచేవారు. దీనికి పక్కనే తెలంగాణా ఆంధ్రా సబ్‌ఏరియా ప్రధాన కార్యాలయం ఉండడంతో అక్కడికి వచ్చే అధికారులు వైస్రాయల్ అతిథి గృహంలో నివసించే వారు. స్వాతంత్ర్యం అనంతరం 1950లో ఈ భవనాన్ని భారత ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవడంతో రాష్ట్రపతి నిలయంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. రాష్ట్రపతి నిలయం 76 ఎకరాలులో విస్తరించి ఉంటుంది. భవనంలో 20 గదులు ఉన్నాయి. భవనం వెలుపల 20 గదులు రాష్ట్రపతి సిబ్బంది కోసం ఉంటాయి. మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ నుంచి దక్షిణాది పర్యటన ప్రారంభమైంది. జులై, ఆగస్టు నెలలో గాని లేదా డిసెంబరు, జనవరి నెలల్లో రాష్ట్రపతులు ఇక్కడ పర్యటిస్తారు.

**రాష్ట్రపతి పర్యటన వివరాలు**

రాష్ట్రపతి ద్రౌపి ముర్ము ఈ నెల 17న బొల్లారం రాష్ట్రపతి నిలయం చేరుకుంటారు. 18,19 తేదీలులో నగరంలో ఎటువంటి అధికారిక పర్యటనలు లేక పోవడంతో నిలయానికే పరిమితం అవుతారు. 20న సికింద్రాబాద్ సైనిక్‌పురి సమీంపలోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కళాశాల (సిడిఎం)లో జరిగే కలర్స్ ప్రజెంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. సాయత్రం 4 గంటలకు నిలయంలో వివిధ రంగాల ప్రముఖులుతో కలిసి తేనేటి విందులో పాల్గొంటారు. 21న కోఠి మహిళా కళాశాలలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా బేగంపేట్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి వెళతారు.

# కుంట్లూరు పెద్దచెరువును సర్వేచేసిన హైడ్రా అధికారులు

**-ఎఫ్‌టిఎల్‌లో రోడ్డు వేస్తుండడంపై గ్రామస్థుల ఫిర్యాదు**

**-కౌన్సిలర్లు, అధికారులు సిండికేట్‌గా మారి అక్రమాలకు పాల్పడుతున్నారు: సిపిఐ**



సర్వే చేస్తున్న సిబ్బంది

**హయత్‌నగర్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి కుంట్లూర్ గ్రామంలోని పెద్దచెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో రోడ్డును వేస్తున్న విషయమై వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు మంగళవారం చెరువును సందర్శించి సర్వే నిర్వహించారు. కుంట్లూర్ పెద్దచెరువు సర్వేనెంబరు 185లో 95 ఎకరాల మేర విస్తరించి ఉండగా... దాదాపు 60 శాతం కబ్జాకు గురయ్యింది. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధి నుంచి తమ పట్టా భూమివరకు మున్సిపాలిటీ వైస్‌ఛైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు ఏకంగా రోడ్డును వేస్తున్నారని గ్రామస్తులు హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ రంగనాథ్ హైడ్రా అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు పంపించారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ ఆదిత్య, తహశీల్దార్ హేమలు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు సర్వే చేశారు. అయితే... తమకెలాంటి సమాచారం అందించకుండా సర్వేచేయడం ఏమిటని పట్టాదారులు అధికారులను ప్రశ్నించి సర్వేను అడ్డుకునే యత్నం చేశారు. ఈక్రమంలో అధికారులకు, పట్టాదారులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్సీకాలనీ ప్రజల సౌకర్యార్థం రోడ్డును ప్రతిపాదించామని ఉద్దేశ్యపూర్వకంగానే రోడ్డును అడ్డుకునేందుకు ఫిర్యాదు చేశారని వైస్‌ఛైర్మన్ కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై హైడ్రా అధికారులు మాట్లాడుతూ... చెరువు ఎఫ్‌టిఎల్‌లో రోడ్డు వేయడంపై ఫిర్యాదు వచ్చిందని సర్వేచేయడం ద్వారా పూర్తి వివరాలు వెల్లడవుతాయని తెలిపారు. సర్వేను అడ్డుకుంటే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రభుత్వ నిధులతో ఎఫ్‌టిఎల్‌లో రోడ్డు వేయడం ఏంటి: సీపీఐ**

పెద్దచెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో 40 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయడానికి ఇప్పటికే మున్సిపాలిటీ అధికారులు ఫార్మేషన్ పనులు చేపట్టారు. దీనికోసం ఏడాది క్రితం 20 లక్షల నిధులను మంజూరు చేస్తూ కౌన్సిల్ సమావేశంలో తీర్మాణం చేసినట్లుగా చెబుతున్నారు. అయితే... ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు ఉన్నప్పటకీ మున్సిపాలిటీ అధికారులు రోడ్డుకోసం నిధులు మంజూరు చేయడం ఏమిటని సీపీఐ నాయకులు రవీంద్రాచారి ప్రశ్నించారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో కౌన్సిలర్లు, కమిషనర్ సిండికేట్ అయ్యారని ఆరోపించారు. చెరువులు, కుంటలను రక్షించాల్సిన ప్రజా ప్రతినిధులు ప్రజా అవసరాల పేరిట కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజాప్రయోజనార్థం రోడ్డును వేయాల్సి వస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అధికారుల అనుమతితో వేయాల్సి ఉంటుందన్నారు. మున్సిపాలిటీలో కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు కౌన్సిలర్లకు వంత పాడుతూ అక్రమాలకు సహకరిస్తున్నారని మండిపడ్డారు. అధికారుల తీరుపై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేస్తామని, కోర్టుకు సైతం వెళతామన్నారు.

# ఏసిబి దాడులు చేస్తున్నా రెచ్చిపోతున్న అవినీతి తిమింగలాలు..

## -అవినీతికి కేరాఫ్ విద్యుతు కూకట్‌పల్లి డిఇ కార్యాలయం..

**హైదరాబాద్, డిసెంబర్ 10, ప్రభాతవార్త** నగరం, శివార్లలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడుల్ని ముమ్మరం చేస్తున్నా టీజీ ఎస్పీడీసీఎల్ కూకట్‌పల్లి డివిజనల్ (డీఇ) కార్యాలయంతో పాటు ఏఇల కార్యాలయాల్లో అవినీతి, అక్రమ వసూళ్ళకుఅడ్డూ అదుపు లేకుండా పోయింది. కూకట్‌పల్లి డీఇ కార్యాలయంతో పాటు బాచుపల్లి, నిజాంపేట, హైదర్ నగర్, మియాపూర్ ఏఇల కార్యాలయాలు అక్రమార్జనకు నిలయాలుగా మారాయి. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి కూకట్‌పల్లి డీఇ కార్యాలయంలో కుర్చీ దక్కించుకున్న ఓ కీలక అధికారి వడ్డీతో సహా రాబట్టేందుకు మామూళ్ళ దారి పట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి జేబులు నింపుకోవడంలోనే ధ్యాస తప్ప వినియోగదారుల సమస్యలను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టి సారించకపోవడంతో తమకు అడ్డే లేదన్న ధీమాతో డీఇ, ఏఇల కార్యాలయల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న కొందరు అధికారులు తమ అవినీతి దందా కొనసాగిస్తున్నారు. కొందరు అధికారులు మధ్యవర్తులతో పాటు కాంట్రాక్టర్లతో వసూళ్ళ పర్వానికి దిగారనే ఆరోపణలు ఉన్నాయి. వినియోగదారులతోపాటు బిల్డర్లు, కాంట్రాక్టర్లను మామూళ్ళ కోసం పీడిస్తున్నారు. కూకట్‌పల్లి, బాచుపల్లి, నిజాంపేట, హైదర్‌నగర్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో వ్యక్తిగత గృహాలతోపాటు బహుళంతస్తుల భవనాలు, కమర్షియల్ భవనాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. కొత్త కనెక్షన్ కావాలన్నా, కొత్త లైన్ వేయాలన్నా, అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలన్నా, ఇంటి ముందు అదనపు విద్యుత్ సంభం ఏర్పాటు చేయాలన్నా పెద్ద మొత్తంలో లంచాలు ఇవ్వనిదే పనులు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి పనికీ ఓ ధరను ముందే సిద్ధం చేసి మరీ వసూళ్ళకు దిగుతున్నారు. జేబులు నింపుకోవడమే లక్ష్యంగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరు అధికారుల మూలంగా ఎంతో మంది దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అపార్ట్‌మెంట్ డీటీఆర్‌తో పాటు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలంటే ఓ రేటు, త్రీఫేజ్ కనెక్షన్ తీసుకోవాలంటే మరో రేటు, మీటర్ చేంజ్ చేసుకోవాలంటే ఇంకో రేటు ఇలా ఒక్కో పనికి ఒక్కొక్క రేటు పిక్స్ చేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆయా పనుల మంజూరుకు సంబంధించిన ఫైళ్ళను సకాలంలో క్లియర్ చేయకుండా తాము అడిగినన్నీ మామూళ్లు ఇచ్చేంత వరకు సదరు అధికారులు క్లియర్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. డీఇ, ఏఇలు కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వీరిపై ఉన్నతాధికారులు నిఘా కొరవడడంతో కార్యాలయాలను తమ స్వంత ఎస్టేట్‌లా భావిస్తూ తమకు చిత్తం వచ్చినప్పుడు కార్యాలయాలకు వస్తూ, పోతుండడతో ఆయా పనుల కోసం వచ్చే వినియోగదారులు విసిగిపోతున్నారు. వినియోగదారులను దోచుకోవడమే తమ విధి అన్నట్టుగా కొందరు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి.

**రెచ్చిపోతున్న అవినీతి తిమింగలం, ఏఇలు, కాంట్రాక్టర్లతో వసూళ్ళు..**

టీజీ ఎస్పీడిఎల్ కూకట్‌పల్లి డీఇ కార్యాయంలో లక్షలు ఖర్చుపెట్టి రెండు నెలల క్రితం సీటు దక్కించుకున్న ఓ కీలక అధికారి గతంలో అనిశా వలలో చిక్కకుండా తెలివిగా తప్పించుకున్నట్లు అప్పట్లో గుసగుసలు వినిపించాయి. కొన్నేళ్ళ క్రితం సదరు అధికారి ఓ డివిజనులో పనిచేస్తున్న సమయంలో సబ్ ఇంజనీరు (ఏఇ) ఏసీబీకి చిక్కిన విషయం విధితమే. ఈ అవినీతి వ్యవహారం వెనుక ఈ కీలక అధికారి హస్తం ఉన్నట్లు సమాచారం. ఏసీబీ దాడుల నుంచి ఈ అధికారి అప్పట్లో తెలివిగా తప్పించుకున్నట్లు సమాచారం. కూకట్‌పల్లి డీఇ కార్యాలయంలో కీలక అధికారికి రాజకీయ అండదండలతోపాటు ఉన్నతాధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉండడంతో తాను పని చేసిన ప్రతి చోట అక్రమ వసూళ్ళకు పాల్పడి కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా కొందరు ఏఇలు కూడా అనేక అక్రమాలకు పాల్పడి పెద్ద మొత్తంలో అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపనలు ఉన్నాయి. కొందరు అధికారులకు నగరం, శివార్లతోపాటు వారి స్వంత జిల్లాల్లో పెద్దఎత్తున స్థలాలతోపాటు వ్యవసాయ భూములు ఉన్నట్లు తెలిసింది. అక్ర మాలతో కోట్ల ఆస్తుల్ని కూడబెట్టుకున్న కొందరు అధికారుల విషయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఎందుకు దృష్టి సారించడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# హైదరాబాద్ వార్త



# ఎవరి వ్యూహం..వారిదే

**-జిహెచ్‌ఎంసి ఎన్నికలే టార్గెట్...**

**-మరో ఏడాదిలో ముగియనున్న పాలకవర్గం గడువు**

**-మేయర్ పీఠం టార్గెట్‌గా అన్ని పార్టీల ప్రణాళికలు**




**హైదరాబాద్, డిసెంబరు 10,ప్రభాతవార్త:** రాష్ట్రంలో అతిపెద్ద కార్పొరేషన్ జిహెచ్‌ఎంసి ఎన్నికలే లక్ష్యంగా అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ జిహెచ్‌ఎంసిలో పట్టులేకపోవడంతో కాంగ్రెస్ ఇప్పటినుంచే ప్రణాళికలు రచిస్తోంది. రాష్ట్రం ఏర్పడిన దశాబ్దం కాలం తర్వాత పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా జీహెచ్‌ఎంసీపై జెండా ఎగురవేయాలని భావిస్తోంది. 2020 డిసెంబర్లో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరగగా కౌన్సిల్ పదవీకాలం 2025 డిసెంబర్‌తో ముగియనుంది. దీంతో పదవీకాలం ముగిసేందుకు ఇంకా ఏడాది సమయమే ఉండడంతో జీహెచ్‌ఎంసీలో విజయకేతనం ఎగురవేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. 2020 బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ ఆ తర్వాత రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత జరిగిన రాజకీయ సమీకరణల చేరికలతో కార్పొరేటర్ల సంఖ్య 19కి పెరిగింది. దీంతో తమ పార్టీలోకి రావాలని భావించే కార్పొరేటర్లకు 2026లో జరిగే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్ టికెట్ కేటాయించడం తో పాటు పార్టీలో కూడా మంచి గుర్తింపు నిస్తామని హామీ ఇస్తున్నట్లు తెలుస్తుంది. ఈఎన్నికల్లో కనీసం వంద సీట్లు గెలవాలన్న సంకల్పంతోకాంగ్రెస్ వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం.

### టార్గెట్ జీహెచ్‌ఎంసీ..

తెలంగాణలో ప్రస్తుతం ఆసక్తికర రాజకీయం నడుస్తోంది. మూడు పార్టీలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య రాజకీయ రంజుగా సాగుతోంది. గ్రేటర్ పరిధిలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ బలంగా ఉండగా.. మరో ప్రతిపక్షం బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఆ పార్టీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి పాలనకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా విమర్శలు, ప్రతివిమర్శలు పెద్దఎత్తున సాగుతున్నాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గుజారాతీ గులాం అని.. లక్షన్నర కోట్లు నిధులు తెస్తే సన్మానం చేస్తామని.. లేదంటే గుజరాత్‌కు వలస వెళ్లాలని.. ఇలా తీవ్ర పదజాలంతో విరుచుకుపడుతున్నారు. వాస్తవానికి ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ లో కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్ వంటి నాయకులు ఉండగా సీఎం రేవంత్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ చేస్తుండడం ఎందుకు? అనే ప్రశ్న వస్తోంది. ఓవైపు బిఆర్‌ఎస్‌ను బలహీనపరచడంతోపాటు బిజెపి టార్గెట్‌గా విమర్శలు గుప్పిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరిగే నాటికి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంటుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా జీహెచ్‌ఎంసీలో గెలవడం కాంగ్రెస్‌కు, రేవంత్‌కు అత్యంత కీలకం. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు కంటోన్మెంట్ ఒక్క సీటు వచ్చింది. దీంతో రాజధానిలో ప్రాతినిధ్యం లేని ప్రభుత్వంగా హేళన ఎదుర్కొంది. ఇక దేశంలో కీలక నగరమైన హైదరాబాద్ లో, రాష్ట్ర రాజధాని నుంచి కేబినెట్ లో మంత్రి కూడా లేరు. ఇలాంటి సమయంలో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటడం కాంగ్రెస్ కు ప్రతిష్ఠాత్మకం.

**మా లెక్కలు మాకున్నాయ్..**

అయితే కాంగ్రెస్ ఎన్ని వ్యూహాలు రచించినా మాలెక్కలు మాకున్నాయని అంటున్నారు బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు. జీహెచ్‌ఎంసీలో బీజేపీ బిఆర్‌ఎస్‌లకు గట్టి పట్టుంది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు ఎమ్మెల్యేల బలం ఉంది. 2021లో జరిగిన ఎన్నికల్లో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను బీజేపీ మూడు చెరువుల నీళ్లు తాగించింది. చావుతప్పి కన్ను లొట్టబోయినట్లుగా బీఆర్‌ఎస్ ఎంఐఎం సహాయంతో జీహెచ్‌ఎంసీని కైవసం చేసుకుంది. ఇక ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. ముక్కోణపు పోటీని తట్టుకుని జీహెచ్‌ఎంసీని చేజిక్కించుకోవడం చాలా కష్టమే. అయితే వచ్చే ఎన్నికల్లో ఎంఐఎం సహకారంతో ఇది సాధ్యమనే అంటున్నారు ఆపార్టీ అగ్రనేతలు. బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటికే దానం నాగేందర్ వంటి కీలక ఎమ్మెల్యేను కాంగ్రెస్ లో చేర్చుకున్నారు. రాజేంద్ర నగర్, శేరిలింగపల్లి ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ కూడా హస్తం గూటికి చేరారు. మరికొందరు హైదరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలనూ లాగే ఆలోచనలో చేసినా ప్రస్తుతానికి నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో గ్రేటర్‌లో తమ పట్టు పెంచుకునేందుకు అభివృద్ధి పనులపైనా దృష్టి కేంద్రీకరించారు. అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబులు తరచూ విస్తృతంగా పర్యటిస్తూ గ్రేటర్‌లో బలమైన పునాదులు వేస్తున్నారు. అయితే, జీహెచ్‌ఎంసీ ఎన్నికలలోగా కొందరు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లో చేర్చుకునే అవకాశం లేకపోలేదు.

మరో ఏడాదిలో జరగను న్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తమ సీటుతో పాటు పోస్ట్ కేటాయింపునకు సంబంధించి పలువురు మంత్రుల వద్ద కొందరు కార్పొరేటర్లు ఇప్పటి నుం చే ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

## వికలాంగులకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలుచేయాలి



వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ప్రసంగిస్తున్న నేతలు

**ధర్నాచౌక్, డిసెంబర్ 10, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు వికలాంగులకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలుచేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు, వికలాంగుల కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ పి.సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, ఎస్పిఆర్‌డి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి వారు మాట్లాడుతూ ఏడాది పాలన ముగిసిన సందర్భంగా విజయోత్సవాలు జరుపుకుంటున్నారు కానీ వికలాంగులకు ఇచ్చిన హామీలను మాత్రం విస్మరించారని విమర్శించారు. వికలాంగుల న్యాయమైన డిమాండ్ల సాధనకై చేసే పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఎస్పిఆర్‌డి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కే.వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం.అడిశయ్య, కోశాధికారి ఆర్.వెంకటేష్‌లు మాట్లాడుతూ వికలాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగుల పెన్షన్‌లు ఆరువేలకు పెంచాలని, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సంక్షేమ శాఖను ఏర్పాటుచేయాలని, వికలాంగుల కార్పోరేషన్ ద్వారా నిరుద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించాలని, ప్రతి జిల్లా కేంద్రాలలో మానసిక వికలాంగుల పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వికలాంగుల కోసం ప్రత్యేక స్టడీ సర్కిల్స్ ఏర్పాటుచేయాలని, బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు వికలాంగుల సంక్షేమానికి ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాధర్నాలో నాయకులు నాగలక్ష్మి, దశరథ్, యశోద, కాశప్ప, లింగయ్య, ఆరిఫా, బస్వరాజుస్వామి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కెపిహెచ్‌బి కాలనీలో ఫుట్ పాత్‌ల ఆక్రమణల తొలగింపు...

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 10, ప్రభాతవార్త** రెక్క ఆడితే గాని డొక్కాడని వీధి వ్యాపారస్తులు ఫుట్ పాత్‌లపై ఉన్న దుకాణాలను జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ అధికారులు తొలగించడంతో తీవ్ర ఆందోళన గురయ్యారు. మంగళవారం మూసాపేట సర్కిల్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ చౌరస్తా నుండి నెక్సస్ మాల్ వరకు అదేవిధంగా టెంపుల్ బస్ స్టాప్ నుండి బ్రాండ్ ఫ్యాక్టరీ వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న షాపులను జెసిబి సహాయంతో తొలగించారు. దీంతో సదరు విధి వ్యాపారస్తులు కనీసం ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడమే కాకుండా తమ సామాను కూడా తీసుకునే సమయం ఇవ్వలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవైపు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూనే మరోవైపు కేసీఆర్ రావాలి తమకు న్యాయం చేయాలని వీధి వ్యాపారస్తులు పేర్కొంటున్నారు.

## ముగ్ధమనోహరం శౌర్య కూచిపూడి రంగప్రవేశం



శౌర్యసంపద కూచిపూడి రంగప్రవేశంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, డిసెంబరు 10 ప్రభాతవార్త :** ఏడేళ్ల చిరుప్రాయంలోనే భారతీయ శాస్త్రీయ నృత్యకళ కూచిపూడిపై మక్కువతో ప్రఖ్యాత నాట్యగురువు డా. పి.రమాదేవి వద్ద శిక్షణ ప్రారంభించి పరిపూర్ణత సాధించి మంగళవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తన కూచిపూడి రంగప్రవేశ ముగ్ధమనోహర ప్రదర్శనతో ఎం.శౌర్య సంపద ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది. శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో జరిగిన శౌర్యసంపద రంగప్రవేశంలో డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ స్వరపరిచిన ఆదితాళంలో గం గణపతిం అంశంతో ప్రారంభించి మోహనరాగంలో మండోదరి శబ్ధం; మైసూరు వాసుదేవాచార్య స్వరపరిచిన బ్రోచే వారెవరురా; మోహనరాగంలో జక్కిని దరువు; ముత్తుస్వామి దీక్షితులవారి మీనాక్షి మీముదం; కోపమేల రాకయుందునురా జావళి; చివరిగా ముత్తయ్య భాగవతార్ స్వరపరిచిన హంసనందిని తిల్లానా అంశాలను శృతి లయ బద్ధంగా అత్యంత అద్భుతంగా హావభావాలను ప్రదర్శిస్తూ ఆహుతుల ప్రశంసలందుకుంది. నాట్యగురువు డా. పి.రమాదేవి నట్టువాంగం, వి.రేణుకాప్రసాద్ మృదంగం, స్వేతప్రసాద్ గాత్రం, కె.సాయికుమార్ వయోలిన్, ఉమావెంకటేశ్వర్లు వేణువులతో వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ అతిథులు కళాకారిణి శౌర్యసంపదను ఎంతగానో అభినందించి గొప్పకళాకారిణి పేరుప్రఖ్యాతులు పొందాలని శుభాశీస్సులందజేశారు. చివరిగా గురువు డా. పి.రమాదేవికి ఘనంగా గురువందనం కావించారు.

## గాంధీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులపై అధికారులతో కార్పొరేటర్ సమీక్ష

**చిక్కడపల్లి డిసెంబర్ 10 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ లో జరగనున్న అభివృద్ధి పనుల పై గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఏ.పావని వినయ్ కుమార్ మంగళవారం కార్పొరేటర్ కార్యాలయంలో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ అధికారులు డిప్యూటీ ఇంజినీర్ గీత, అసిస్టెంట్ ఇంజినీర్ అబ్దుల్ సలామ్ లతో డివిజన్ లో జరుగుతున్నా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గాంధీ నగర్ డివిజన్ లో కొనసాగుతున్న, పెండింగ్ లో వున్న అభివృద్ధి పై డివిజన్ లోని పార్క్ ల వద్ద ఏర్పాటు చేయాల్సిన ఫెన్సింగ్ లు, పలు చోట్ల రోడ్ల మరమత్తులు, నూతనంగా ఏర్పాటు చేయవలసిన రోడ్డు నిర్మాణం పనులపై చర్చించారు. అరుంధతీ నగర్ బస్తీ లో మంజూరైన నూతన రోడ్డు నిర్మాణం టెండర్ ప్రక్రియలో వుందని, త్వరలో పూర్తి చేసుకొని పనులు ప్రారంభించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్పొరేటర్ సూచనల మేరకు జరుగుతున్న పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.సమీక్ష లో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ , ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

## స్త్రీల హక్కులను మానవ హక్కులుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం ఝాన్సీ

**సైఫాబాద్, డిసెంబరు 10 (ప్రభాతవార్త):** 2006 నుంచి ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు స్త్రీల హక్కులు మానవ హక్కులేనని నినదిస్తున్నారని మన దేశం కూడా అందులో బాధ్యత హించిందని డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి రిజిస్ట్రార్ సుధారాణి చెప్పారు. 1917లోనే డా.బి.ఆర్.అంబేద్కర్ స్త్రీల గురించి ప్రశ్నించారని కుల విముక్తికి మార్గం చూపించిన మహనీయుడని, సమానత్వం కోసం, కనీస సౌకర్యాల కోసం పోరాటం చేశారని మతం పేరిట, కులం పేరిట మారణ హోమం జరుగుతుంటే మనల్ని కాపాడుతున్నది రాజ్యాంగమేనని చెప్పారని ఆమె గుర్తు చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో మంగళవారం స్మార్ట్ కాంప్లెక్స్ లో జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. స్త్రీల హక్కులను మానవ హక్కులు గుర్తించి ప్రభుత్వం చట్టాలను పటిష్టం చేయాలని ఆమె కోరారు. రిటైర్డ్ డిజిఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్త్రీలకు చైతన్యం కలిగించడంలో జ్యోతిరావ్‌పూలే ప్రధాన కారకుడన్నారు. స్త్రీలు అన్ని రంగాలలో మేధావులుగా ఉంటూ ప్రాతినిధ్యం వహిస్తున్నా సమానత్వం ఆమడ దూరంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభకు అధ్యక్షత వహించిన దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ ప్రసంగిస్తూ సార్వ జనీన మానవ హక్కుల ప్రకటనను ఐక్యరాజ్య సమితి ఆమోదించిన తరువాత నుంచి ప్రతి ఏడాది తమ సంస్థ మానవ హక్కుల దినోత్సవాన్ని కొనసాగిస్తున్నదని చెప్పారు. ఈ సభలో కృష్ణకుమారి, దీప్తి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక రాజ్య స్థాపనకు పోరాటాలు విస్తృతం చేయాలి : పాశం యాదగిరి పిలుపు

**సైఫాబాద్, డిసెంబరు 10 (ప్రభాతవార్త):** తెలంగాణ సమాజానికి విశేషమైన సేవలు అందించిన ప్రముఖ పాత్రికేయులు పాశం యాదగిరిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, సన్మానించి అదుకోవాలని నిర్ణయించడం పట్ల ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఎఐటియుసి రాష్ట్ర సమితి తరపున బాల్‌రాజ్ ఆయనను శాలువ, పూల మాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని కార్మిక రాజ్య స్థాపనకు పోరాటాలు మరింత విస్తృతంగా చేయాలని పిలుపు నిచ్చారు. ప్రపంచీకరణ, ఆర్థిక విధానాలు కార్మికులపై తీవ్రంగా పడి ఉపాధి కోసం వలస వెళుతున్నారని, 28 కోట్ల మంది కార్మికులు ఏలాంటి హక్కులు, ప్రయోజనాలు పొందకుండా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు విలాస్‌రావు, ఓమయ్య, పానుగంటి పర్వాతాలు, సబ్బు రాజమౌళి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే డిప్యూటీ సిపిఓ బాలమురళికి సత్కారం


రైల్వే సిపి.ఓ.ఐ.ఆర్.బాలమురళిని సన్మానిస్తున్న రైల్వే కార్మిక నేత రఘుచరణ్ తదితరులు

**కంటోన్మెంట్, డిసెంబర్ 10 (ప్రభాతవార్త):** దక్షిణ మధ్య రైల్వేలో గుర్తింపు ఎన్నికలు ఈ నెల 4,నుంచి 6 వరకు నిర్వహించిన ఎన్నికల్లో రైల్వే డిప్యూటీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ బాలమురళీ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా నిర్వహించినందుకు రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభు చరణ్ బాలమురళిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో రైల్ మజ్దూర్ యూ నియన్ నేతలు అజారి,మోహన్,లహుకుమార్, మర్యాలు పాల్గొన్నారు.

## వైభవంగా ఆలయం బ్రహ్మోత్సవాలు

**చార్మినార్, డిసెంబరు 10 (ప్రభాతవార్త) :** చాంద్రాయణగుట్ట శ్రీ భ్రమరాంబ దేవి సమేత చెన్న మల్లిఖార్జున స్వామి దేవాలయంలో అత్యంత వైభవంగా ఆలయం బ్రహ్మోత్సవాలు జరిగాయి.ఆలయంలో నిర్వహించిన హోమంలో ఇంటిలిజెన్స్ ఏసిపి రుద్ర భాస్కర్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.దేవాలయం ప్రధాన అర్చకులు కోటీ హరీష్ కుమార్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని పాలపొడి వ్యాపారి అరెస్ట్

**ముషీరాబాద్, డిసెంబర్ 10, (ప్రభాతవార్త):** నిబంధనలు పాటించకుండా పాలపొడి వ్యాపారం నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ముషీరాబాద్ పోలీసులతో కలసి అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భోలక్‌పూర్‌కు చెందిన చిట్టబోయిన దామోదర్ (46) కర్నాటకలో క్షీర భాగ్య పథకం ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే పాలపొడి ప్యాకెట్లను తీసుకువచ్చి, వాటిపై తయారీ, గడువు తేదీలు లేకుండా ప్యాకింగ్ మార్చి విక్రయించేవాడు. తక్కువ ధరకు కర్నాటక నుండి తీసుకువచ్చి, అధికధరలకు అమ్ముతూ, ఎటువంటి తేదీలు ముద్రించకపోవటంతో విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం దామోదర్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి పాల పొడి 30కేజీల బ్యాగులు 11, 25 కేజీల బ్యాగులు 18 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆశా వర్కర్ల న్యాయపరమైన డిమాండ్లను అమలు చేయాలి


వైద్యఆరోగ్యశాఖ కమీషనర్‌కు ఆశా వర్కర్ల డిమాండ్లపై వినతి పత్రం సమర్పిస్తున్న సి.ఐ.టి.యు ప్రతినిధులు

**బేగంబజార్,డిసెంబర్ 10(ప్రభాతవార్త):** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశా వర్కర్ల న్యాయపరమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ సి.ఐ.టి.యు రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో తెలంగాణ వైద్య,ఆరోగ్య,శాఖ కమీషనర్ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.వారితో చర్చలు జరిపారు. సోమవారం జరిగిన దాడిని సి.ఐ.టి.యు తీవ్రంగా ఖండించారు.ఆశాలకు ఫిక్స్‌వేతనం 18వేలు,ఇన్‌రెన్స్ 50లక్షలకు చేయాలని,మట్టిఖర్చులకు 50వేలు,రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్,ప్రమోషన్,హెల్త్‌కార్డులు,20రోజుల క్యాజువల్ సెలవులు,ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్‌సెలవుల సమస్యలపైన నిర్దిష్టమైన ప్రతిపాదనలతో కూడిన ఫైల్స్‌ను ప్రభుత్వానికి పెడతామని,పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తామని,ప్రతి ఆదివారం,పండుగలకు సెలవులు,ఇప్పటి నుంచే అమలు చేస్తామని.కేసుల టార్గెట్ రద్దు చేస్తున్నామని,స్పూటమ్ డబ్బాలు మోసే విధానాన్ని రద్దు చేస్తున్నామని చెప్పారు.లెప్రసీ,పల్స్ పోలియో,పెండింగ్ డబ్బులను త్వరలో చెల్లిస్తామని హామి ఇచ్చారు.అనంతరం జాయింట్ డైరెక్టర్ రాజేశం,కృష్ణవేణి,అధికారులు ధర్నా చేస్తున్న ప్రదేశానికి వచ్చి ఈ హామీలను మరొకసారి ఆశాలకు వివరించారు.ఈకార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి,సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, సిఐటియూ హైదరాబాద్‌సెంట్రల్ కార్యదర్శి ఎం.వెంకటేష్, సిఐటియు హైదరాబాద్ సౌత్ అధ్యక్షురాలు ఎం.మీనా, ఆశా రాష్ట్ర నాయకురాలు యాదమ్మ,పద్మ, కె.సునీత, బుచ్చమ్మ,సాధన,కళావతి,బాలమణి,ధనలక్ష్మి,మహేశ్వరి,వంజుల,వరలక్ష్మి,ప్రవీణ,సావిత్రి,హేమలత,సరస్వతి,మంగ తదితరులు పాల్గొన్నారు.

## శంకరమఠంలో కొనసాగుతున్న హరికథా మహోత్సవాలు


శృంగేరి శంకరమఠంలో హరికథా వినిపిస్తున్న ఏలూరుకు చెందిన సప్పా భారతి

**హైదరాబాద్, డిసెంబరు 10 (ప్రభాతవార్త)**

నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకరమఠం ప్రాంగణంలో హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాసు, నేతి లక్ష్మీనారాయణ భాగవతుల జయంతి సందర్భంగా హరికథా మహోత్సవములు నాలుగు రోజులుగా కన్నుల పండుగగా జరుగుతున్నాయి. అన్నమయ్య పరివారం వ్యవస్థాపకుడు యనమండ్ర వెంకట కృష్ణయ్య, నేతి కుటుంబము నుండి శ్రీనివాస్, నటరాజ్ దంపతులు, సుజాత, శారద పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్బంగా వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ నారాయణ దాసు భారతావనిలో అవతరించిన అపర శారదావతారమనీ, 1923లో కాకినాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు సమావేశములో దాసు వినిపించిన రుక్మిణి కళ్యాణం హరికథ తిలకించిన సరోజినీదేవిమీ నృత్యం అద్భుతంగా ఉందని కొనియాడిందన్నారు. అదే సంవత్సరం ఇంగ్లండులో జరిగిన ఎంపైర్ ఎగ్జిబిషన్‌నకు భారతీయ సంగీతమునకు ప్రతినిధిగా దాసును ఎంపిక చేసారని తెలిపారు. దాసుకి నేతి లక్ష్మీనారాయణ మీద పుత్రవాత్సల్యమని, శిక్షణ పూర్తి కాలము నేతికి నారాయణదాసు ఇంట్లోనే వసతి సదుపాయాలు కల్పించిన గొప్ప వ్యక్తియని కొనియాడారు. అనంతరం ఏలూరుకు చెందిన సప్పా భారతి భాగతారిణి తమ మధురస్వరంలో భక్త అంబరీష హరికథాగానము చేసి శ్రోతలను మైమరిపించారు. డాక్టర్ పాణ్యం దక్షిణా మూర్తి వయోలిన్ పైన, ఆర్.సుధాకర్ మృదంగం పైన మృదువైన వాద్య సహకారం అందచేశారు.ఈ సందర్భంగా కళాకారులను నిర్వాహకులు శాలువలతో సత్కరించారు. గురువారం చివరి రోజున బుర్రా పద్మనాభశర్మ భాగవతలచే శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం కథాగానము ఉంటుందని, కథామధ్యమున పద్మశ్రీ అవార్డు గ్రహీత దాలిపర్తి ఉమామహేశ్వరి భాగతారిణికి ముఖ్యఅతిధి ప్లాంజేరి శంకరనారాయణ చేతుల మీదుగా హరికథా సరస్వతి బిరుదుతో సన్మానము జరుగుతుందన్నారు. భక్తులందరు సకాలంలో విచ్చేసి శ్రవణం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ నిర్వాహకులు యనమండ్ర వెంకట కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

## ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి

### - నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి


లక్ష్మీగూడ ఆర్‌కెజి కాలనీలో పాద యాత్ర నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 10 (ప్రభాతవార్త) :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ ఆర్‌జికె కాలనీలో ఆయన పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కలిసి పర్యటించారు.బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు ప్రతీ రోజు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కాలనీ ప్రజలు తమ సమస్యలను నా దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ రేణుక,వర్క్ ఇన్‌స్పెక్టర్ జియా,జిహెచ్‌ఎంసి ఏఈ బలవంత్‌రెడ్డి,వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్,సూపర్ వైజర్ వినయ్,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికే జనార్దన్,బిజెపి నాయకులు సిచిన్ బబ్లు,తలారి చిన్న,పాండు యాదవ్,అడికే శివ,ఎన్ను శంకర్,నందిని,పూజ,ఎస్‌ఎఫ్‌ఎ మహేందర్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఏడాదిలో 42 మంది విద్యార్థులు చనిపోవడం బాధాకరం

### ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు మచ్చ నర్సయ్య



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న నర్సయ్య, వెంకటేష్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 10,(ప్రభాతవార్త):** గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఒక్క సంవత్సరంలోనే 42 మంది వివిధ కారణాల వల్ల చనిపోవడం బాధాకరమని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు మచ్చ నర్సయ్య అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 1009 వివిధ గురుకులాలు ఉన్నాయని నిత్యం ఏదో ఒక ఘటన జరగటం బాధాకరమన్నారు. ముఖ్యంగా బిల్లులు పెండింగ్లో ఉండదంతో విద్యార్థులకు సరైన పౌష్టికా హారం అందటం లేదన్నారు. పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయడంతోపాటు, మూడు నెలల బిల్లులు అడ్వాన్స్ చెల్లించాల న్నారు. చాలా గురుకులాలు అద్దెభవనాల్లో అరకొర వసతులతో ఉన్నాయని, అన్నింటికీ సొంత భవనాలు నిర్మించాలని కోరారు. గురుకులాల కొత్త చైర్మన్ తల్లిదండ్రులు పిల్లల్ని కలవకూదదు అని జీవో తీసుకు వచ్చారని దాన్ని వెంటనే ఉపసంహరించుకుని పిల్లల్ని కలిసే అవకాశం కల్పించాలని కోరారు. అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి ఎస్.వెం కటేష్, మెట్ల శంకర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



బేగంపేట్‌లోని హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కాలర్‌షిప్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న పంచాయతీ రాజ్,రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్ బి.షఫివుల్లా ,ఐఎఫ్ఎస్ జావేద్ హుద్,అలి ఉద్దీన్ హైదర్ ,తదితరులు

## తెలుగు తల్లి విగ్రహాన్ని మార్పు చేయడం సరైంది కాదు : గజ్జెల నాగేశ్

**కంటోన్మెంట్,డిసెంబర్ 10 (ప్రభాతవార్త):** తెలంగాణ తల్లి విగ్రహాన్నిమార్పు చేయడం సరైంది కాదని బేవరేజెస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ తెలిపారు.తెలుగు తల్లి విగ్రహాన్ని మార్పును నిరసిస్తూ మంగళవారం కంటోన్మెంట్ 3వ వార్డు అన్నానగర్ చౌరస్తాలో తెలుగు తల్లి విగ్రహానికి బిఆర్ఎస్ నేతలు నిర్వహించిన పంచామృత కార్యక్రమానికి అయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలు కోరుకున్న తెలంగాణ తల్లినే కలుసుకోవడం జరిగిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సరైంది కాదన్నారు. గతంలో ఉన్న మాదిరిగానే తెలంగాణ తల్లి విగ్రహాన్ని యధా విధిగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మాజీ బోర్డు సభ్యురాలు అనితా ప్రభాకర్, బిఆర్ఎస్ నాయకులు జంగిలి రాజు, రావుల సతీష్, సాయికిరణ్, కనకయ్య, షేర్వాన్, జంగిలి మురళీ యాదవ్, పనస సంతోష్, దేవులపల్లి శ్రీను, కిరణ్, వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## మణికొండలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసిన బిఆర్ఎస్ నేతలు

**నార్సింగి, డిసెంబర్ 10 (ప్రభాతవార్త) :** మణికొండ మున్సిపల్ పరిధిలోని మర్రిచెట్టు సర్కిల్ వద్ద మంగళవారం బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అధ్యక్షులు సీతారాం ధూళిపాళ్ల నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం సమయంలో మేధావులంతా కలిసి ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి రూపంను, ఇప్పటి సర్కారు మార్చడం బాధాకరమైన విషయమన్నారు. ధగధగా మెరిసిపోతూ నిండు ముత్తయిదువు వలే నగలు, కిరీటం ధరించి, బతుకమ్మ ఒక చేత్తో, పాడి పంటలు మరొక చేత్తో పట్టుకొని అందరిని ఆకట్టుకునేదన్నారు. అలాంటి తెలంగాణ తల్లి రూపును దొరల తల్లి అని ఎగతాళి చేయడం సిగ్గుచేటన్నారు. సర్కారు మారిన ప్రతీసారి తెలంగాణ తల్లి విగ్రహం రూపును మార్చడం మంచి పద్ధతి కాదన్నారు. తెలంగాణ తల్లి రూపంను మార్చడంను నిరసిస్తూ తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కుంబగళ్ల ధన్‌రాజ్, అందె లక్ష్మణ్‌రావ్, గుట్టమీది నరేందర్, సంఘం శ్రీకాంత్, విఠల్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, బుద్దోలు బాబు, భాను చందర్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను అభినందిస్తున్న మాజీ సిఎం కెసిఆర్

**హైదరాబాద్, డిసెంబరు 10 (ప్రభాతవార్త)**

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కలుసుకున్నారు. మంగళవారం కాలేరు వెంకటేష్ జన్మదినం సందర్భంగా కెసిఆర్‌ను ఆయన ఫాంహౌస్‌లో కలుసుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి వెళ్లిన కాలేరు వెంకటేష్‌ను కెసిఆర్ శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు కాలేరు వెంకటేష్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు స్వీకరించారు.

## శ్రీ చౌడేశ్వరి మాత ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలి : బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 10, (ప్రభాతవార్త) :** శ్రీ చౌడేశ్వరి మాత ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో జీవించాలని కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆకాంక్షించారు. మంగళవారం కూకట్పల్లి నియోజకవర్గంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన యాదవుల కుల దైవం శ్రీ చౌడేశ్వరి మాత ఆలయాన్ని కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కూకట్పల్లి యాదవ సంఘం ప్రెసిడెంట్ బత్తుల మల్లేష్ యాదవ్, యాదవ సంఘం మాజీ అధ్యక్షులు గండి మల్లేష్ యాదవ్, నాయకులు మహేందర్ యాదవ్, రాజు యాదవ్, నర్సింహా యాదవ్, పాండు యాదవ్, ప్రవీణ్ యాదవ్, దుర్గయ్య యాదవ్, నవీన్ యాదవ్, బాలేష్ యాదవ్, శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

## అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం సమావేశం


నియామక పత్రాలు అందుకుంటున్న సభ్యులు

**నిజాంపేట్, డిసెంబర్ 10, (ప్రభాతవార్త)**

అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉషోదయ టవర్స్, షాపూర్ నగర్, హైదరాబాద్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో హైదరాబాద్ వాస్తవ్యులు కుంచపు రమను తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా, నల్గొండ జిల్లా వాస్తవ్యులు బొంత చిరంజీవిని రాష్ట్ర యూత్ అధ్యక్షులుగా, హైదరాబాద్ వాస్తవ్యులు సంపంగి వెంకటేష్‌ని రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శులుగా నియమిస్తూ నియామక పత్రాలు ఇవ్వటం జరిగినది. ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్, జాతీయ మహిళా అధ్యక్షురాలు వేముల తిరుమల దేవి, జాతీయ మహిళా ఉపాధ్యక్షురాలు గుంజ రేణుక, జాతీయ యూత్ అధ్యక్షులు రమేష్ మంజల్కర్, రాష్ట్ర అధ్యక్షులు జి.వి. నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజల హనుమయ్య, రాష్ట్ర కార్మిక అధ్యక్షులు సాతల గోపాల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రేవన్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ హై స్కూల్ ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**నిజాంపేట్, డిసెంబర్ 10, (ప్రభాతవార్త)**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిజాంపేట్ యందు విద్యార్థులే ఉపాధ్యాయులై సర్వం తామై స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రిగా మేఘనశ్రీ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా దీపిక, పాఠశాల సంచాలకులుగా సైదులు నాయక్, ఆర్జెడిగా కృష్ణవేణి, జిల్లా కలెక్టర్‌గా టి అశోక్, డిప్యూటీ కలెక్టర్‌గా సాగర్, జిల్లా విద్యాశాఖ అధికారిగా సహస్ర, జిల్లా ఉప విద్యాధికారిగా విజయదుర్గ, మండల విద్యాధికారిగా ప్రవళిక, పాఠశాల నేటి ప్రధానోపాధ్యాయులుగా వైష్ణవి వ్యవహరించారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆయా పాత్రల్లో ఒదిగి తమ రెగులర్ ఉపాధ్యాయులను అనుకరిస్తూ టిఎల్‌ఎం ఉపయోగించి చక్కగా పాఠాలు బోధించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌గా వ్యవహరించిన విద్యార్థులు పాఠశాలను క్రమశిక్షణతో ఉంచడమే కాకుండా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు ఆటపోటీలను తలపించేలా ఆటలు ఆడిస్తూ సందడి చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఉపాధ్యాయ పాత్రల్లో విద్యార్థులు ఒదిగిపోయి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించడం అభినందనీయం అన్నారు. ఇదే స్ఫూర్తితో జీవితంలో క్రమశిక్షణతో ఉండి మంచి బాటలో పయనించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రెగులర్ ఉపాధ్యాయులు, నేటి విద్యార్థి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సకాలంలో పనులు పూర్తి చేయండి

### : కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

**అల్వాల్, డిసెంబరు 10 (ప్రభాతవార్త):** కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఓల్డ్‌అల్వాల్‌లో నిర్మాణంలో ఉన్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆమె కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రజలు సహకారంతోనే ముందుకు సాగాలని స్పష్టం చేశారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇ అభిషేక్, రామారావు, క్రిష్ణామాచారి, శేఖర్, గిరి,అరుణ్, లింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి


చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, డిసెంబరు 10 (ప్రభాతవార్త):** సమస్యలులో ఉన్న ప్రజలకు అండగా ఉంటామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. వెంకటాపురం డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి 36లక్షలు విలువైన చెక్కులను అందించారు. వైద్య పరమైన అవసరాలకు తోడు అర్హులైన వారికి కళ్యాణ లక్ష్మీ తదితర ప్రభుత్వ పథకాలు అందించేందుకు కార్పొరేటర్లు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత కిషోర్‌తో పాటుగా పవన్ కళ్యాణ్, బాగ్యలక్ష్మీ, ముత్యాలు రావు, లక్ష్మణ్, మోహన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## కురుమ ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలన


కోకాపేట్‌లోని దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మ గౌరవ భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి.

**నార్సింగి, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**

గండిపేట మండలం కోకాపేట గ్రామంలో నిర్మించిన దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మ గౌరవ భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లను సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ నెల 14.వ, తేదీన దొడ్డి కొమురయ్య కురుమ సంఘ భవనంను సీఎం రేవం త్‌రెడ్డి ప్రారంభిస్తారని, ఇందుకు అన్ని శాఖల అధికారులు సమ న్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌అండ్‌బి, హెచ్‌ఎండిఏ, పోలీస్, మున్సి పల్, విద్యుత్, జల మండలి అధికారులంతా సభా వేదిక, బారికే డింగ్, లైటింగ్, జనరేటర్ తదితర ఏర్పాట్లను చేయాలని సూచిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే సభకు 30.వేల మంది ప్రజలు హాజరవుతారని, అందరికి తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎగ్గె మల్లేష్, క్యామ మల్లేష్, డిసిపి శ్రీనివాస్, బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్,కురుమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XIV ADDL JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S.No. 5398 OF 2024
BETWEEN:
1. **Sailaja Reddy Sathi,** W/o Sathi Prasad Reddy, Aged above 54 years Occ: House wife,
2. **Sathi Harshavardhan Reddy,** S/o Sathi Prasad Reddy, Aged above 34 years Occ: pvt employee,
**Sathi Alekhya Reddy,** D/o Sathi Prasad Reddy, Aged above 29 years Occ: pvt employee,
All are resident of Shalivahana Nagar,Near Hunman Temple, VTC: Amberpet, PO: Malakpet colony,Sub Dist; Amberpet, Dist; Hyderabad Telangana pin code; 500036. ..Plaintiffs
AND
1. All concerned
2. The Mandal Tahasildhar officer Amberpet, Having office Amberpet, Police Colony, Amberpet, Hyderabad District, Telangana-500013 ..Defendants
Sirs,
Whereas the above named Plaintiffs have filed the above suit seeking the declaration as legal heirs of Late Sathi Prasad Reddy died on 29-09-2024. Therefore, all concerned are hereby requested to appear before the Hon'ble court at **10.30 A.M. on 30-12-2024** either in person or through Counsel duly instructed if you have any objection. Otherwise the matter will be heard and decided exparte in your absence.
(By order of the Court)
**M/s. G K LEGAL FIRM** Represented by its partners, BUMANAMADHAM GANJI, (TS/1306/2009), **P Venkataiah Goud K Naveen Kumar, K Sridhar, Advocates,** #Flat No.G3, H.No.4-176/4, Raghavendra Residency, RCI Road, Sri Satya Sai Nagar, Jillelaguda, Balapur, Hyderabad-500097.
**Cell No.9392552949,**
**Email: lawyer.bhooma@gmail.com**
**Counsel for Plaintiffs**

SUMMONS FOR APPEARANCE OF DEFENDANT
IN THE COURT OF HON'BLE III ADDL JUNIOR CIVIL JUDGE, M-M DIST, AT: KUSHAIGUDA
O.S.NO. 1138 OF 2024
Between:
**Smt. Vandana Navusu & another**
Rep by their GPA holder
**R.S.Dasaratha Ram Reddy** ...Plaintiff
And
1. **The Tahasildar**, Keesara Mandal.
2. **All concern** ...Defendants
To,
**All Concern.**
Take notice that the plaintiffs herein have filed the above suit for declaration to declare the Plaintiffs are the legal heirs of late Jada Leelavathi. The above suit is posted to **27-12-2024.** If anyone having any objections, claim or interest are hereby directed to appear before this Hon'ble court on **27-12-2024 at 10.30 A.M.** by personally or through an advocate, failing which matter will be decided on merits.
//BY ORDER OF THE COURT//
**JETTY GANGADHAR**
**P. MOHAN MURTHY**
**ADVOCATES**
Plot No.24, Ravi Co-Op Colony, Trimulgherry, Secunderabad-15.,
**Mob: 8074617525**

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, REDHILLS, HYDERBAD
ABR.C.F. NO. 578 OF 2024
BETWEEN:
**M/s. SHRIRAM RAGHAVENDRA CHITS PVT LTD.,** Rep. by its FOREMEN/ MANAGER, Sri VEERAGANI SHIVA KRISHNA ....DISPUTANT
AND
1. **G. RATNAMALA** W/O T SRINIVASA MURTHY DOB:02-04-1969, OCCUPATION:SENIOR ASSISTANT, GOVT. MUSIC AND DANCE SCHOOL,GUNTUR R/O H.NO: 28-09-339, ASHOK NAGAR,1ST LANE, BACKSIDE BSNL OFFICE, GUNTUR, PHNO:9701615783.
2. **D. GOPALACHARYULU** S/O D. SITARAMACHARYULU, DOB: 15-06-1968 OCCUPATION: SCHOOL ASSISTANT, ZPHS PEDHAPANIPADU GUNTUR, R/O 13-2-14, KARETIVARI VEEDHI, PINAPADU, GUNTUR, PH.NO: 7337249953.
3. **P.MOHAN RAO** S/O P. SUNDARA RAO DOB: 10-12-1968, OCCUPATION: JUNIOR ASISTANT, MUNCIPAL CORPORATION OF GUNTUR R/O H.NO:7-6-999/28, VENGALRAONAGAR, 2/2 ARUNDALPETA, NEAR BENHAR CHRUCH GUNTUR PH NO: 6300703534.
4. **KSNR DEEKSHITULU** S/O CH.SUBBAIAH, OCCUPATION:SENIOR ASSISTANTDEP: JOINT DIRECTOR OF AGRICULTURE GUNTUR H.NO:H.NO: 4-5-4/8B,NAVABHARATH NAGAR, SECOND LANE, GUNTUR, PH NO:9492177698.
...OPPONENTS
As on the date of filing disputed claim is **Rs.4,84,780/-** you are hereby directed to appear before Deputy Registrar of Chit/Arbitrator, Red Hills, Hyderabad in person duly on Date **23-12-2024, at 11 A.M.** in to show cause why the application should not be complied with that we may cause for to be done.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**A. Lavan Kumar, B.sc. L.L.M., Advocate**
#501, 5th Floor, "Amsri Classic" Opp: St. Mary's Church, Beside Madava Nursing Home, S.D. Road, Secunderabad.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, REDHILLS, HYDERBAD
ABR.C.F. NO. 582 OF 2024
BETWEEN:
**M/s. SHRIRAM RAGHAVENDRA CHITS PVT LTD.,** Rep. by its FOREMEN/ MANAGER, Sri VEERAGANI SHIVA KRISHNA ....DISPUTANT
AND
1. **THANDUR SURYANARAYAN RAO** S/O T.M. SHANKAR DOB:04-8-1987 OCCUPATION:HQ1 EME CENTRE UDC KOUKOOR R/O H.NO: 3-54/17/C-07, MANDHABANDA, LOTHKUNTA PHNO:9908210961.
2. **P.RAMBABU** S/O P.BABURAO DOB: 01-06-1980 OCCUPATION: UDC HQ1 EME CENTRE KOUKOOR R/O B-186, DAD COMPLEX, KARKHANA, SECUNDRABAD PH.NO:7993049948.
3. **T.RAGHURAM** S/O T.RAMANA DOB: 17-06-1988, OCCUPATION: LDC HQ1 EME CNTRE KOUKOOR R/O H.NO: 13-134 DAD COMPLEX KARKHANA SECUNDRABAD PH NO:9121802258.
4. **K.NAVEEN KUMAR** S/O K.KRISHNA DOB:10-08-1977, OCCUPATION: BARBER HQ1 EME CENTRE KOUKOOR R/O:H.NO: 5-631/516, AMBEDKAR NAGAR, ALWAL PH.NO:9951797525.
....OPPONENTS
As on the date of filing disputed claim is **Rs.2,14,155/-** you are hereby directed to appear before Deputy Registrar of Chit/Arbitrator, Red Hills, Hyderabad in person duly on Date **23-12-2024, at 11 A.M.** in to show cause why the application should not be complied with that we may cause for to be done.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**A. Lavan Kumar, B.sc. L.L.M., Advocate**
#501, 5th Floor, "Amsri Classic" Opp: St. Mary's Church, Beside Madava Nursing Home, S.D. Road, Secunderabad.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, REDHILLS, HYDERBAD
ABR.C.F. NO. 572 OF 2024
BETWEEN:
**M/s. SHRIRAM RAGHAVENDRA CHITS PVT LTD.,** Rep. by its FOREMEN/ MANAGER, Sri VEERAGANI SHIVA KRISHNA ....DISPUTANT
AND
1. **TUMMALA SAIKUMAR** S/O TUMMALA NARAYANA DOB:31-07-1985 OCCUPATION:BUSSINESS SRI SAI RAM BAMBOO BALLIS MARCHANT ATTAPUR R/O 1-8-3/22/3, SURYA NAGAR, CHIKADPALLY, HYDERABAD, PHNO:9899355421.
2. **G. VENKATESHAM** S/O G. ADIVAIAH DOB:1-03-1989 OCCUPATION: POLICE CONSTABLE NARSING HYDERABAD, R/O H.NO: 2-4, TANGADIPALLI, CHEVELLA, RANGAREDDY DISTRICT PH.NO: 9000078321.
3. **P. VENKATAIAH** S/O P. TIMMMAIAH DOB: 02-09-1978, OCCUPATION: POLICE CONSTABLE KATEDHAN , DURGANAGAR P.S R/O H.NO: 4-41, ARSHIREDDY PALLY VILLAGE, KOMREDDY PALLY PANCHAYAT, GANDEPET, R.R. DISTRICT, PH NO: 7901115459.
4. **CHERUKU VEERA GOUD** S/O CHERUKU NAGAIAH GOUD DOB: 18-10-1974, OCCUPATION: BUSSINESS SREE BANDEPPA SWAMY BAMBOO&BALLIS MARCHANT, OLD MALLEPALLY R/O: 11-1-954/2, AFZALSAGAR, OLD MALLEPALLY PH.NO:9849329318. ...OPPONENTS
As on the date of filing disputed claim is **Rs.2,21,144/-** you are hereby directed to appear before Deputy Registrar of Chit/Arbitrator, Red Hills, Hyderabad in person duly on Date: **23-12-2024,at 11 A.M.** in to show cause why the application should not be complied with that we may cause for to be done.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**A. Lavan Kumar, B.sc. L.L.M., Advocate**
#501, 5th Floor, "Amsri Classic" Opp: St. Mary's Church, Beside Madava Nursing Home, S.D. Road, Secunderabad.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, REDHILLS, HYDERBAD
ABR.C.F. NO. 577 OF 2024
BETWEEN:
**M/s. SHRIRAM RAGHAVENDRA CHITS PVT LTD.,** Rep. by its FOREMEN/MANAGER, Sri VEERAGANI SHIVA KRISHNA ....DISPUTANT
AND
1. **UZMA** W/O ABUDUL ARSHAD DOB:18-07-1989, OCCUPATION:HOUSE WIFE R/O 4-3-128/2/1/A, KAHAJANAGAR, ATTAPUR, RAJENDARANAGAR PHNO: 9121781103.
2. **SYED ABDUL ARSHAD** S/O ABDUL KAYYUM, DOB:10-06-1977 OCCUPATION:CIVIL CONTACTOR , R/O H.NO: 4-3-128/2/1/A, KAHAJANAGAR, ATTAPUR, RAJENDARANAGAR PH.NO: 9885513331.
3. **VEMULA PRAVEEN KUMAR** S/O VEMULA SRIHARI, DOB: 17-08-1984, OCCUPATION: METER INSPECTOR, HMWSS HYDERABAD R/O H.NO: 4-6, VADDERBASTHI, NEAR, GOVT.HIGH SCHOOL HIMAYATSAGAR, GOLKONDA PH NO: 7032616801.
4. **MD. ABDUL HAFEEZ** S/O ABDUL SAMEE DOB: 09-01-1969, OCCUPATION: TECHNICIAN GRADE II HMWSS HYDERABD, R/O: 20-4-513, KHILWATH, CHARMINAR, HYDERABAD, PH.NO: 9885392834.
5. **T.ROHIT SINGH** S/O T.ROOPKUMAR SINGH, DOB:31-12-1980 OCCUPATION: ASSOSIATE PROFESSOR, MALLA REDDY COLLEGE OF MEDICAL SCIENCES QUTBULLAPUR HYDERABAD, R/O H.NO: 3-13-138/1/A, CHAIKYAPURI COLONY, FCI ROAD, MALLAPUR, KAPRA R.R.DISTRICT, PH.NO: 8333821465.
6. **M. MOHINUDDIN AHMED SIDDIQUI** S/O MD. QUTUYBUDDIN AHMED SIDDIQUI OCCUPATION: SIDDIQUIS CONSTRUCTIONS BUILDERS&DEVELOPERS R/O 18-1-350/157, YOUSUFAIN COLONY, CHANDRAYANGUTTA, RAKKSHAPURAM, BANDLAGUDA PH NO:9849959698.
....OPPONENTS
As on the date of filing disputed claim is **Rs.4,29,276/-** you are hereby directed to appear before Deputy Registrar of Chit/Arbitrator, Red Hills, Hyderabad in person duly on Date: **23-12-2024, at 11 A.M.** in to show cause why the application should not be complied with that we may cause for to be done.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**A. Lavan Kumar, B.sc. L.L.M., Advocate**
#501, 5th Floor, "Amsri Classic" Opp: St. Mary's Church, Beside Madava Nursing Home, S.D. Road, Secunderabad.

## క్రీడలకు అన్ని విధాలుగా ప్రభుత్వం ప్రోత్సాహం
### -చైర్మన్ చెకోలేకర్ లక్ష్మీ



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,డిసెంబరు 10 ,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులకు అండగా ఉండి క్రీడారంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మీ అన్నారు. ముసారంబాగ్ లోని స్వామి వివేకానంద పాఠశాలలో గ్రౌండ్ లో మంగళవారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సైదాబాద్ మండల స్థాయిలో చీఫ్ మినిస్టర్ కప్ 2024ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్,సైదాబాద్ మండల తహసిల్దార్ జయశ్రీ , మలక్ పేట్ ఇన్స్పెక్టర్ నరేష్, సైదాబాద్ డిప్యూటీ ఈవో రాధాకృష్ణ, బిజెపి సీనియర్ నేత బొక్క మధుసూదన్ రెడ్డి తదితరులు హాజరై సైదాబాద్ మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. మండల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ మాట్లాడుతూ.. యోగా, కబడ్డీ ,ఖో ఖో,వాలీబాల్ ఫుట్బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 టీములు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందన్నారు . కార్యక్రమంలో హెచ్ ఎం శివకుమార్ , సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సునీల్ కుమార్, పి ఈ టి లు, టీచర్లు పాల్గొన్నారు

## మానవ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి
### -జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీదేవి




**అబ్దుల్లాపూర్ మెట్ డిసెంబరు10,ప్రభాతవార్త :** అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం అబ్దుల్లాపూర్ మెట్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు హై స్కూల్ దశ నుండే చట్టాల పట్ల, మానవ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండటం అవసరం అని అన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన అబ్దుల్లాపూర్ మెట్టు ఎస్‌హెచ్‌ఓ అంజిరెడ్డి మాట్లాడుతూ ...విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచిస్తూ ..సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించారు. ఇదే వేదికపైన సురక్ష సేవసంఘం రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ దశ నుండే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని అవి సాకారం చేసుకోవటానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో అబ్దుల్లాపూర్ మెట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ కుమార్, అబ్దుల్లాపూర్ మెట్టు పోలీసు స్టేషన్ ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, ఇంకా హై స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవు
### : బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న మహేశ్వర్ రెడ్డి

**హుడా కాంప్లెక్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** శానిటేషన్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించక పోతే చర్యలు తప్పవని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మధురపురి కాలనీ కోణార్క్ థియేటర్ వద్ద జి.హెచ్.ఎం.సి శానిటేషన్ సిబ్బందితో అయన సమీక్షా నిర్వహించారు. ఈ సందర్బంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ లో పరిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని కాలనీ వాసులనుండి తరుచు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు . సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వహించకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇకపై నుంచైనా విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.హెచ్.ఎం.సి శానిటేషన్ సిబ్బంది పాండు, రాంకీ జోష్నా, బీజేపీ కార్యకర్తలు రఘునందన్ జోషి, టీంకు, కార్తీక్ పాల్గొన్నరు.

## బడంగ్‌పేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ నేతలు

**సరూర్‌నగర్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ సాయిబాలాజీ కాలనీ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి తదితరులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంరెడ్డి వెంకట్‌రెడ్డి, ముత్యాల కృష్ణ, లిక్కి కృష్ణారెడ్డి, రామిడి తూఫాన్‌రెడ్డి, ఎర్రబట్టు శ్రీనివాసరాజు, పెద్దబావి మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సిపిఎం జిల్లా కార్యదర్శిగా వెంకన్న నియామకం

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శిగా ఉప్పల్ సిపిఎం కార్యదర్శి జె.వెంకన్న నియమితులైయ్యారు. ఈ మేరకు సిపిఎం మేడ్చల్ జిల్లా మూడో మహాసభల సందర్భంగా కుత్బుల్లాపూర్‌లో జరిగిన సభలలో ఆయనను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి జె.వెంకన్న మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సిపిఎం పార్టీ ప్రజా సమస్యలపై తమ వంతు పోరాటం సాగిస్తుందని తెలిపారు.

## తెలంగాణలో ఎమర్జెన్సీని తలపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలన: సబితా ఇంద్రారెడ్డి



పార్టీ శ్రేణులతో కలిసి జిల్లెలగూడ చందన చెరువు వద్ద తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేసిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో నేటి కాంగ్రెస్ పాలన నాటి ఎమర్జెన్సీని తలపిస్తున్నదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర సచివాలయం ఆవరణలో ప్రభుత్వం కాంగ్రెస్ తల్లిని తలపించే విధంగా ఏర్పాటు చేసిన విగ్రహ రాజకీయానికి నిరసనగా అసలైన తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేయాలని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ చందన చెరువు ఆవరణలో ఉన్న తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన సబితా ఇంద్రారెడ్డి తాను స్వయంగా పాలతో తెలంగాణ తల్లి విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో ఆమె విగ్రహాన్ని పూర్తిగా క్షీరాభిషేకంతో శుద్ధి చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో కవులు, కళాకారులు, మేధావులతో సంప్రదించి నాడు కెసిఆర్ అంద రూ మెచ్చే రీతిలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందిం చిందని వెల్లడించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో సిఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి కెసిఆర్‌పై విషం చిమ్ముతూ చేస్తు న్న కుట్రల్లో భాగంగా తెలంగాణ తల్లి రూపాన్నే మార్చారని ఆరోపించారు. తెలంగాణ తల్లి చేతిలో ఇక్కడి ప్రజల సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మను కూడా లేకుండా చేశారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే తెలంగాణ చిహ్నాల్లో చార్మినార్‌ను, ఓరుగల్లు కళా తోరణాన్ని విస్మరించారనీ ప్రస్తుతం తెలంగాణ తల్లిని మార్చి బతుకమ్మ లేకుండా చేయడాన్ని గమనిస్తుంటే ముమ్ముందు తెలంగాణనే ఎందుకు అనే పరిస్థితి తీసుకొస్తారేమోనని ఆయన విమర్శించారు. తెలంగాణలో కెసిఆర్ పాలన ఆనవా ళ్లు లేకుండా చేయాలనే రాజకీయ దురుద్దేశ్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ఆమె ఆరోపించారు. ఈ చర్యల వల్ల తెలం గాణ అస్తిత్వం దెబ్బతింటుందని ఆమె పేర్కొన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజునే జీతాల పెంపు కోసం ఆందోళ న చేస్తున్న ఆశా వర్కర్లపై లాఠీఛార్జి చేయించి వారికి పెద్ద గిఫ్టే ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనను గమనిస్తుంటే ఎమర్జెన్సీ రోజుల ను తలపి స్తున్నాయని సబితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు దిండు భూపేష్ గౌడ్, దీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్లు బొక్క రాజేందర్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, పద్మ అంజయ్య, దోమలపల్లి ధనలక్ష్మి రాజ్‌కుమార్, మాజీ ఎంపిటి సిలు పాల పర్తి విజయలక్ష్మి, లలితా జగన్, మహిళాధ్యక్షురాలు జమా ల్‌పూర్ సునీత, పార్టీ నాయకులు సిద్దాల బీరప్ప, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాదరి రమేష్, గడ్డమీది లక్ష్మణ్ ముది రాజ్, హాము నాయక్, అబ్బనమోని గోపియాదవ్, తేరేటిపల్లి శ్రీనివాస్ గుప్త, శశిపాల్‌రెడ్డి, చింతకింది జ్ఞానేశ్వర్, సుర్వి లత శేఖర్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రూ.20లక్షలతో సివరేజీ పైప్‌లైన్ పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మల్లికార్జుననగర్‌లో సివరేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ మల్లికార్జుననగర్ కాలనీలో రూ.20లక్షల వ్యయంతో చేపడుతున్న సివరేజీ పైప్‌లైన్ పనులను మంగళవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌లో అభివృద్ది పనులు వేగవంతం చేయాలని కోరారు. ప్రణాళికబద్దంగా డివిజన్ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటి వరకు కోట్లాది రూపాయలతో పనులు చేపట్టామని తెలిపారు. సివరేజీ పైప్‌లైన్ పనులు త్వరంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం సంతోష్‌కుమార్, డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, కొక్కొండ జగన్, నారాయణరెడ్డి, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, పిట్టల నరేష్, శ్రీనివాస్‌యాదవ్, బలరామ్, రామాంజనేయులు, ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, బాలేం దర్, నర్సింగ్, శ్యామ్, జయమ్మ, కాలనీ నేతలు సంతోష్‌రెడ్డి, ప్రసాద్‌చారి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాల బైరవ బ్రహ్మోత్సవాలకు మంత్రి సురేఖకు ఆహ్వానం



రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటి నేతలు

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లోని శ్రీ కాలబైరవ ఆలయం బ్రహ్మోత్స వాల సందర్భంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఆలయ కమిటి నేతలు కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీ కాల బైరవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22, 23 తేదిలలో జరుగుతాయని, ఈ ఉత్సవాలకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు ప్రజాప్రతినిధులను ఆహ్వానించనిట్లు తెలిపారు. ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని, ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాలకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఉత్సవాలకు హాజరవుతారని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు కన్నయ్య పంతులు, ఆలయ కమిటి నేతలు కంచెమీది శివయ్య, పూజల లక్ష్మణ్, ఈగ సంతోష్, నిదానకవి సు ధాకర్, శామీర్‌పేట వినోద్‌రెడ్డి, ఉపేందర్, పూజల ప్రభాకర్, లింగంపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాత తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం




పాలాభిషేకం నిర్వహిస్తున్న సామ సుందర్‌రెడ్డి, సామ స్వప్న

**సైదాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** తెలంగాణ తల్లి విగ్రహం ఆకృతిని మార్చడం సరికాదని యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నలు అన్నారు. బిఆర్ఎస్ అగ్ర నాయకత్వం పిలుపు మేరకు మంగళవారం పాత తెలంగాణా తల్లి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేర్లు మార్పు, విగ్రహాలు మార్చడం తప్ప ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ సదన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థి అదృశ్యం



**హయత్‌నగర్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** కళాశాలకు వెళ్లిన విద్యార్థి ఇంటికి తిరిగిరాని సంఘటన హయత్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... హయత్‌నగర్ భాగ్యలతకాలనీ శాంతినగర్‌కు చెందిన కుమావత్ భోమారాం కుమారుడు పవన్(16) కొత్తపేటలోని తపస్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 7న ఉదయం 7.30 గంటలకు కళాశాలకు వెళ్తానంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతను సాయంత్రం ఇంటికి తిరిగిరా లేదు. అదేరోజు కళాశాల యాజమాన్యం బోమారాంకు ఫోన్‌చేసి పవన్ కళాశాలకు రాలేదని సమాచారం అందించారు. దీంతో పవన్ కోసం బంధువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేక పోవడంతో భోమారాం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రేస్‌చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మోజెస్‌కు నియామకపత్రం అందిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

**హయత్‌నగర్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ లక్ష్మారెడ్డిపాలెంలోని గ్రేస్‌చర్చి వేదికగా తెలుగు బాప్టిస్ట్ కన్వెన్షన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్ డెవెలెప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ... శాంతి, ప్రేమ, ఐక్యత సమాజ అభివృద్దికి తోడ్పతాయన్నారు. పెద్దఅంబర్‌పేట ప్రాంత క్రిష్టియన్ సోదరులు తమ కుటుంబ సభుల్లా ఉంటూ ఎల్లవేలలా తమకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తారని తెలిపారు. అనంతరం బిషప్‌గా బాధ్యతలు స్వీకరించిన మోజెస్‌కు నియామకపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో క్రిష్టియన్ కమ్యూనిటీ ప్రతినిధులు ఐసీసీ అధ్యక్షులు డా.శావల జోసేఫ్, తెలుగు బాప్టిస్ట్ కన్వెన్షన్ అధ్యక్షులు టి.శ్యామ్, బిషప్ సింగం, డా.సత్యపాల్, బిషప్ ఐసాక్, డా.సుధాకర్ పాల్గొన్నారు.

## రామంతాపూర్ శివాలయం హుండీ లెక్కింపు

**రామంతాపూర్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శివాలయం హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. ఆలయ కమిటి చైర్మన్ నామ్ రాజిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి వెల్లంకి నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం హుండీ లెక్కించారు. దేవాలయం ఆదాయం రూ.1,03,653 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వెల్లంకి నరేందర్ తెలిపారు. ఆలయ అభివృద్దికి ప్రతి ఒక్కరు సహకరించాలని వారు కోరారు. ఆలయం కల్యాణ మండపం నిర్మాణం తుది దశకు చేరుకుందని, పనులు త్వరగా పూర్తి చేసేందుకు భక్తులు సహకరించాలని వారు కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ పోరాటం




మహిళకు సభ్యత్వాన్ని అందిస్తున్న రవీంద్రాచారి

**హయత్‌నగర్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతోందని పార్టీ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామశాఖ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుంట్లూర్ గ్రామంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం మున్సిపాలిటీ అధికారులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడతామన్నారు. కులమతాలకు అతీతంగా భారత సమాజాభివృద్ధికి పార్టీ శ్రేణులు పాటుపడాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కుంట్లూర్ శాఖ కార్యదర్శి బిక్షంనాయక్, నాయకులు వెంకటేష్, శ్రీను, నగేష్, లింగస్వామి, మధు పాల్గొన్నారు.

## తలరాతలు మారుస్తానని తల్లిని మారుస్తావా
### : ప్రధాన కార్యదర్శి అరవిందశర్మ



ఆందోళన నిర్వహిస్తున్న అరవింద్‌శర్మ తదితరులు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో ప్రజల తలరాతలు మారుస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని మార్చడం దుర్మార్గపు చర్య అని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి అరవింద్‌శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని మార్చడానికి నిరసిస్తూ మంగళవారం ఆర్కేపురం చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకాలంలో రూపొందించిన తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చడం జరిగిందని విమర్శించారు. ప్రభుత్వం తెలంగాణ అస్తిత్వం మీద దాడి చేస్తూ చరిత్ర ఆనవాళ్లు నాశనం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. ప్రభుత్వాలు మారితే తల్లులను మార్చేస్తారా అని ప్రశ్నించారు. రాజసం ఉట్టిపడేలా ఉండే తల్లిని మార్చేసి, కాంగ్రెస్ తల్లిని తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, రామాచారి, కొండ్ర శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, కంచర్ల శేఖర్, జగన్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, బాలుశ్రీ, రామ్‌నరసింహగౌడ్, సాజిద్, శంకర్, వానపోస వెంకటేష్,అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో వ్యాపారం చేయాలి : ఇమ్మడి




సమావేశంలో మాట్లాడుతున్న ఇమ్మడి రమేష్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** వినియోగదారుల అభివృద్ధికి అనుగుణంగా నడుచుకుంటూ క్రమశిక్షణతో వ్యాపారాలు చేయాలని ఇమ్మడి జ్యువెలర్స్ అధినేత ఇమ్మడి రమేష్ పేర్కొన్నారు. నాగోల్ హోటల్లో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి102ఏ గవర్నర్ సూరిశెట్టి నరసింహగుప్త, ప్రాజెక్టు చైర్మన్ బాదం రవికుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల బిజినెస్ సమ్మేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్‌తో పాటు ప్రాజెక్టు ఇంటర్నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షుడు విశ్వనాథం నాగేశం, శ్రవణ్‌కుమార్, సినీరంగ లేడీ ప్రొడక్షన్ డైరెక్టర్ దీప్తి మట్ట హాజరై వ్యాపారం చేసే విధానాలు, లక్షణాలు, మెలకువలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేష్ ధర్మకేశ్వర్, బాదం కళావతి, ఏలుకుర్తి శ్రీనివాస్, ఆలేటి రవికుమార్, చంద్రమౌళి, వాడకట్టు విజయకుమార్, విజయలక్ష్మి, డాక్టర్ అనంతం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్, వాటర్‌వర్క్స్, విద్యుత్ సిబ్బందికి సత్కారం



కార్యక్రమంలో పాల్గొన్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఆర్కేపురం నివాసుల హౌస్‌బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణపురం కాలనీలో విద్యుత్ వీధిదీపాలు, వాటర్‌వర్క్స్, పారిశుద్ధ్య కార్మికులు, గార్డెన్ వర్కర్లు, ఇతర సేవలను అందిం చే వారికి మంగళవారం సన్మానం చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా చిలుక ఉపేందర్‌రెడ్డి హాజరై సర్వీస్ ప్రొవైడర్లను సన్మానించడంతో పాటు నూతన దుస్తులను, చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిలుక ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ అనునిత్యం కాలనీలోని వారికి అనేక ఉత్తమ సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ఎందరికో స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రామారావు, అన్నపూర్ణ, నరహరిరావు, గణేశాబాబు, గోపాల్, మునిపల్లె శ్రీనివా స్, శ్రవణ్, సుధాకర్రావు, నీలిమ, రాధ, విజయలక్ష్మి, స్వప్న, అర్చన, పుష్ప, సరిత, సురేఖ, మాధవి, డాక్టర్స్ పద్మకుమారి, రాజశేఖర్, సునీల్ కుమార్, లక్ష్మణ్, శ్రీధర్రావు, నరసింహారాజు, నరసింహామూర్తి, యాకయ్య, రవి, బాబు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌నగర్‌లో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు




క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మురుకుంట్ల అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేజ్-3లో తెలంగాణ పాస్టర్ ఫెల్లోషిప్ ఆధ్వర్యంలో ప్రీక్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ హాజరయ్యారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు దుప్పట్లు, బట్టలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ అంటేనే ఏసుప్రభును ఆరాధించడం, పూజించడమన్నారు.

**తెలంగాణ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ**

హానరబుల్ ప్రెసిడెంట్ ఎ.ఎలీష, ప్రెసిడెంట్ ఎన్.జాన్, ఎస్.వసంత్‌కుమార్, ఎన్.విజయ్‌కుమార్, తిమోతిబాబు, కె.ప్రభాకర్, కె.రాజు, యం.సంజీవ, గంట డేవిడ్‌రాజ్, పి.ఐజాక్‌రాజ్, టి.నోవాహు, యం. ప్రేమ్, యం.భాస్కర్, బిఆర్ఎస్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, భాలుశ్రీ, ముచ్చింతల జగన్, మహమ్మద్ జాహెద్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణం పనులను పరిశీలించిన కార్పొరేటర్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌కాలనీలో రూ.9లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీలైన్ పనులను కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పరిశీలించారు. డ్రైనేజీలైన్ లెవెల్స్ సరిచూసుకుని వేయాలని, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జలమండలి అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భూగర్భ డ్రైనేజీలైన్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరిఫ్, దయాకర్ కాలనీ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి చిత్రపటానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి క్షీరాభిషేకం



చిలుకానగర్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పు చేయడం సబబు కాదన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## సూర్యనగర్ కాలనీలో పైప్‌లైన్ పనులతో అవస్థలు



ఉప్పల్ సూర్యనగర్‌లో పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో అవస్థలు పడుతున్న స్థానికులు దృశ్యం.

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ సూర్యనగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు నత్తనడకన సాగుతుండడంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కాలనీలో గత 20 రోజుల క్రితం పురాతన పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్లు వేసేందుకు జలమండలి అధికారులు పనులు చేపట్టారు. అయితే పనులు నత్తనడకన చేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్ పనుల కారణంగా సూర్యనగర్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు మరో మార్గం లేక అవస్థలు పడుతున్నారని, దీనిపై జలమండలి అధికారుల దృష్టికి తీసుకుని వచ్చినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతుందని, మురుగునీటి దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని, రోడ్లంతా బురదమయంగా మారిందని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను కలిసిన చంపాపేట నాయకులు



ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను సన్మానిస్తున్న కట్ట వెంకటేష్

**సైదాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** మాలల సింహ గర్జన విజయవంతం అయిన సందర్భంగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని చంపాపేట డివిజన్ మాల సంఘాల ఐక్య వేదిక నాయకులు కట్ట వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మదెద్ల నర్సింహా, మద్దెల రమేష్, చంద్రయ్య, తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.